కేసీఆర్‌పై అభిమానంతో..

రైతు బాంధవుడైన కేసీఆర్ అంటే రైతులకు ఎనలేని అభిమానం. సూర్యాపేట జిల్లా నూతనకల్‌కు చెందిన యువరైతు బండి అనిల్.. యాసంగికి సిద్ధం చేసిన నారుమడిలో 'జై కేసీఆర్' ఆంగ్ల అక్షర ఆకృతిలో వడ్లు చల్లగా, పచ్చని నారు పెరిగింది. అది చూసి మురిసిపోయిన అనిల్ శనివారం 'జై కేసీఆర్' నారుతో సెల్ఫీ దిగాడు. –నూతనకల్

ఖమ్మంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల ర్యాలీ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఖమ్మంలో టీకప్పులు పట్టుకొని శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. – ఖమ్మం ఎడ్యుకేషన్

కేజీబీవీల ఎదుట విద్యార్థినుల ధర్నా

బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో తరగతులు సక్రమంగా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం, జూలూరుపాడు, చండ్రుగొండ కేజీబీవీల ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు శనివారం ధర్నా నిర్వహించారు. – రఘునాథపాలెం/జూలూరుపాడు/చండ్రుగొండ

మహబూబాబాద్ జిల్లా కురవిలో పాదయాత్రగా బయలుదేరిన దళిత రైతు బేతమల్ల సహదేవ్, సంఘీభావం తెలుపుతున్న రైతులు

మాఫీ కోసం నాగలితో కలెక్టరేట్‌కు

- వివిధ సంఘాల నేతలతో కలిసి పాదయాత్ర
- జనవరి 26లోగా అందరికి రుణమాఫీ చేయాలి
- లేదంటే ఫిబ్రవరిలో ఆమరణ దీక్ష: రైతు హెచ్చరిక

కురవి, డిసెంబర్ 21: రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కురవిలో నిరాహార దీక్షచేస్తున్న రైతు సహదేవ్ శనివారం నాగలి భుజాన వేసుకుని మహబూబాబాద్ కలెక్టరేట్‌కు పాదయాత్రగా వచ్చారు. ఈ సందర్భంగా సహదేవ్‌కు రైతులు బేతమల్ల సహదేవ్, భూక్యా మంగీలాల్‌నాయక్, మిర్యాల శ్రీనివాస్, నూతక్కి సాంబశివరావు సంఘీభావం పలికారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సహదేవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి జనవరి 26లోగా రూ.2 లక్షలలోపు ఉన్న రైతులందరికి పంట రుణమాఫీ చేయాలని, లేదంటే ఫిబ్రవరి మొదటి వారం నుంచి కలెక్టరేట్ ఎదుట ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఈ పాదయాత్రకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు కుర్ర మహేశ్, బీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామెల్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంగోత్ చందూలాల్, సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు సురేశ్ నాయక్, గిరిజన వికలాంగుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రాందాస్ నాయక్, ఎన్‌పీఆర్‌డీ మాజీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ ఖాజా, రైతులు, జర్నలిస్టులు సంఘీభావం తెలిపారు.

బిల్లులు చెల్లించాకే ఎన్నికలు నిర్వహించాలి

సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్లులు ఇవ్వాలని మంత్రులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవటం విడ్డూరమని తెలిపారు. అసెంబ్లీలోనైనా స్పష్టమైన ప్రకటన చేస్తారని ఆశించినా తమకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 27న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

బిల్లు వచ్చేదాక జీపీ భవనంలోనే ఉంట

నెన్నెల, డిసెంబర్ 21 : 'లక్షలాది రూపాయలు అప్పు తెచ్చి గ్రామాభివృద్ధికి పెట్టిన. ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ పైసా రాలే. ఉండటానికి నాకు ఇల్లు లేదు. అందుకే నేను కట్టిన జీపీ భవనంలోనే నివాసం ఉంటున్న. ఎవరేం చేసుకుంటారో చేసుకోండి' అంటూ మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోణంపేట మాజీ సర్పంచ్ డోలే చిన్నక్క కొడుకు శంకర్ స్పష్టంచేశాడు. 2014-15లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.12లక్షలు మంజూరు చేయడంతో అప్పుడు సర్పంచ్ కొడుకు శంకర్ నిర్మాణం చేపట్టాడు. స్లాబ్ పూర్తయినప్పటికీ బిల్లులు సక్రమంగా రాకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగు చెందాడు. చివరకు పంచాయతీ భవనంలోనే నివాసం ఉంటున్నాడు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లగా శుక్రవారం అధికారులు కోణంపేటకు వెళ్లి విచారణ చేపట్టారు. భవనాన్ని విడిచి వెళ్లాలని శంకర్‌కు చెప్పినా బిల్లులు వచ్చే వరకు ఇక్కడే ఉంటానని తేల్చి చెప్పాడు.

భద్రాచలంలో సీఆర్టీల ధర్నా

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. వీరికి టీపీటీఎఫ్ నేతలు సంఘీభావం ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని సీఆర్టీలు మండిపడ్డారు. –భద్రాచలం

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల రాస్తారోకో

తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు ఆందోళన చేపట్టారు. శనివారం కామారెడ్డిలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి, ఇప్పుడు పరీక్ష రాయాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. – కామారెడ్డి

ఎన్నికల వాగ్దానం ఏమైంది?

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను రైతులు ప్రశ్నించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులోని ఆంజనేయస్వామి ఆలయం ఎదుట వంద మంది రైతులు ఆందోళన చేపట్టారు. 'కృష్ణా నీరు వద్దు.. మా భూములే ముద్దు ' అంటూ నినాదాలు చేశారు. ఎన్నికలప్పుడు ప్రాజెక్టు నిర్మించకుండా చూస్తానని చెప్పిన ఎమ్మెల్యే నేడు రైతులను తొక్కుకుంటూ వెళ్లి ప్రాజెక్టు నిర్మిస్తానని అనడం ఎంత వరకు సమంజసమని ధ్వజమెత్తారు. –బల్మూర్

ఆట

కోయల్, నీలమ్‌కు రజతాలు

దోహా: ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత లిఫ్టర్లు కోయల్ బార్, నీలమ్‌దేవి రజత పతకాలతో సత్తాచాటారు. శనివారం జరిగిన 55కిలోల యూత్ విభాగంలో బరిలోకి దిగిన కోయల్ స్నాచ్‌లో 79కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 103కిలోలతో మొత్తం 182కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. 55కిలోల జూనియర్ విభాగంలో నీలమ్‌దేవి 190కి(స్నాచ్‌లో 86కి+క్లీన్ అండ్‌జర్క్‌లో 104కి) రజతాన్ని ఖాతాలో వేసుకుంది. వీరిద్దరి ప్రదర్శనతో టోర్నీలో భారత పతకాల సంఖ్య ఆరుకు చేరుకుంది. ఇప్పటికే 40కిలోల విభాగంలో జోష్న సాబర్ 135కిలోలతో కొత్త ఆసియా రికార్డును నెలకొల్పిన సంగతి తెలిసిందే.

భారత్‌లో షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: భారత్ వేదికగా వచ్చే ఏడాది ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్ టోర్నీ జరుగనుంది. ఈ విషయాన్ని జాతీయ రైఫిల్ సమాఖ్య(ఎన్ఆర్ఏఐ) శనివారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇటీవలి సీనియర్ ప్రపంచకప్(2023), వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత భారత్‌లో జరుగనున్న మేజర్ అంతర్జాతీయ టోర్నీగా ఇది నిలువనుంది. దేశంలో షూటింగ్‌కు ఉన్న క్రేజ్, వసతి సౌకర్యాలు వరల్డ్‌కప్ ద్వారా మరింతగా ప్రాచుర్యంలోకి రానున్నాయి. మెగాటోర్నీకి సంబంధించి తేదీలు ఇంకా ఖరారు కాలేదు.

రాహుల్‌కు గాయం!

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టుకు ముందు భారత్‌కు ఎదురుదెబ్బ. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) సిరీస్‌లో సూపర్‌ఫామ్ మీదున్న టీమ్‌ఇండియా ఓపెనర్ కేఎల్ రాహుల్ గాయమైంది. శనివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో కుడిచేతికి బంతి బలంగా తాకడంతో రాహుల్ విలవిలలాడిపోయాడు. వెంటనే ఫిజియో సహాయంతో రాహుల్ ప్రాథమిక చికిత్స తీసుకున్నాడు.

అన్మోల్ అదరహో

లిస్ట్-ఏలో వేగవంతమైన సెంచరీ • 35 బంతుల్లోనే శతక ధమాకా

అన్మోల్‌ప్రీత్‌సింగ్ (115)

అహ్మదాబాద్: విజయ్ హజారే వన్డే టోర్నీలో తొలి రోజే రికార్డులు బద్దలయ్యాయి. చాంపియన్స్ ట్రోఫీలో బెర్తు దక్కించుకోవడమే లక్ష్యంగా ప్లేయర్లు రికార్డుల మోత మోగించారు. అరుణాచల్‌ప్రదేశ్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ బ్యాటర్ అన్మోల్‌ప్రీత్‌సింగ్(45 బంతుల్లో 115 నాటౌట్, 12ఫోర్లు, 9సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. పూర్తి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో పంజాబ్ 9 వికెట్ల తేడాతో అరుణాచల్‌ప్రదేశ్‌పై ఘన విజయం సాధించింది. అరుణాచల్ నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యఛేదనలో పంజాబ్ 12.5 ఓవర్లలో వికెట్ కోల్పోయి 167 స్కోరు చేసింది. ప్రత్యర్థి పసలేని బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ అన్మోల్‌ప్రీత్ 35 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో లిస్ట్-ఏలో వేగవంతమైన సెంచరీ అన్మోల్ ఖాతాలో చేరగా, యూసుఫ్ పఠాన్(40బంతుల్లో) రికార్డు బ్రేక్ అయ్యింది. ఓవరాల్‌గా చూస్తే లిస్ట్-ఏలో వేగవంతమైన సెంచరీ జేక్‌ఫ్రేజర్(29 బంతులు), ఏబీ డివిలీయర్స్(31బంతుల్లో) పేరిట ఉంది. అన్మోల్ తన సుడిగాలి ఇన్నింగ్స్‌లో 12ఫోర్లు, 9 భారీ సిక్స్‌లతో విరుచకుపడ్డాడు. తొలుత అరుణాచల్‌ప్రదేశ్ 48.4 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. అశ్వని, మయాంక్ మూడేసి వికెట్లు తీశారు. మరోవైపు ముంబైతో జరిగిన భారీ స్కోరింగ్ మ్యాచ్‌లో కర్ణాటక 7 వికెట్లతో గెలిచింది. ముంబై విధించిన 383 పరుగుల ఛేదనలో కర్ణాటక..క్రిష్ణన్ శ్రీజిత్(101 బంతుల్లో 150 నాటౌట్, 20ఫోర్లు, 4సిక్స్‌లు) భారీ సెంచరీతో 46.2 ఓవర్ల లోనే విజయాన్నందుకుంది. తొలుత ముంబై కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(114 నాటౌట్) సెంచరీతో 50 ఓవర్లలో 382/4 స్కోరు చేసింది. నాగాలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 42 పరుగుల తేడాతో గెలిచింది. అవనీశ్(100)సెంచరీతో రాణించాడు.

కోహ్లీ రెస్టారెంట్‌కు నోటీసులు

బెంగళూరు: టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ చిక్కుల్లో పడ్డాడు. ఫైర్ సేఫ్టీ విషయంలో సదరుశాఖ నుంచి ఎన్‌వోసీ లేని కారణంగా బెంగళూరు బృహత్ మహానగర పాలికె(బీబీఎమ్‌పీ) కోహ్లీకి చెందిన 'వన్8 కమ్యూన్' రెస్టారెంట్‌కు నోటీసులు జారీ చేసింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా నోటీసులు ఇవ్వాల్సి వచ్చిందని బీబీఎమ్‌పీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. నోటీసులకు రెస్టారెంట్ యాజమాన్యం నుంచి ప్రతిస్పందన రాలేదని, ఏడు రోజుల్లోగా రాకపోతే లీగల్ యాక్షన్ తీసుకంటామని బీబీఎమ్‌పీ అధికారులు పేర్కొన్నారు. చిన్నస్వామి స్టేడియం సమీపంలో ఆరో అంతస్తులో కోహ్లీ రెస్టారెంట్ నడుస్తున్నది.

ఉతప్పపై అరెస్ట్ వారెంట్

బెంగళూరు: భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్పపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. తన సొంత కంపెనీ సెంటారస్ లైఫ్‌స్టయిల్ బ్రాండ్‌లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) నిధుల విషయంలో మోసానికి పాల్పడినట్లు తేలడంతో బెంగళూరు రిజినల్ పీఎఫ్ కమిషనర్ గోపాలరెడ్డి..పులకేశి నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు చెందిన వస్త్ర కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ కింద రూ.23,36,602 మొత్తం ఉతప్ప బకాయి పడ్డట్లు తేలింది. ఈ కారణంగా పీఎఫ్, మిసిలీనియస్ ప్రొవిజన్స్ యాక్ట్ 1952 కింద ఈ మాజీ క్రికెటర్‌పై అరెస్ట్ వారెంట్ నమోదైంది. అయితే ఉతప్ప ప్రస్తుతం బెంగళూరులో ఉండటం లేదని దుబాయ్‌లో కుటుంబంతో నివసిస్తున్నట్లు తెలిసింది.

భారత్ X వెస్టిండీస్

నేడు తొలి వన్డే పోరు

వడోదరా: భారత్, వెస్టిండీస్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఆదివారం తెరలేవనుంది. తాజాగా ముగిసిన టీ20 సిరీస్‌ను దక్కించుకున్న టీమ్‌ఇండియా మంచి జోరుమీదుండగా, వన్డే సిరీస్‌లో పుంజుకోవాలని విండీస్ పట్టుదలగా ఉంది. మధ్య కాలంలో వన్డేల్లో విండీస్‌పై భారత్‌దే ఆధిపత్యమైనా..కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ ఫిట్‌నెస్ ఆందోళన కల్గిస్తున్నది. మోకాలి గాయం కారణంగా కౌర్..విండీస్‌తో చివరి రెండు టీ20లకు దూరమైన సంగతి తెలిసిందే. కౌర్ గైర్హాజరీలో స్మృతి మందన సూపర్ ఫామ్‌తో అదరగొట్టింది. టీ20ల్లో ప్రదర్శనను వన్డేల్లోనూ కొనసాగించేందుకు మందన సిద్ధంగా ఉన్నది. గత 10 వన్డేల్లో మందన 60 సగటుతో 599 పరుగులు చేసింది. జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌తో భారత బ్యాటింగ్ బలంగా కనిపిస్తున్నది. మరోవైపు హీలీ మాథ్యూస్, దియోంద్ర డాటిన్, క్యాంప్‌బెల్ లాంటి స్టార్లతో కళకళలాడుతున్నది. తమదైన రోజున వీరు ప్రత్యర్థిపై విరుచుకుపడతారు. మ: 1.30 నుంచి స్పోర్ట్స్-18లో

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.